క్లుప్తంగా

వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించిన గాదె



వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గాదె మధుసూదన రెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): మండలంలో పావులూరు గ్రామంలోని సింహాద్రి వెంకటేశ్వర్లు (మల్లయ్య) ఇటీవల మరణించడంతో వారి నివాసంలో కుటుంబ సభ్యులను పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదివారం పరామర్శించారు. ముందుగా గ్రామంలోని చిడిపూడి నాగేశ్వర రెడ్డి మనుమరాలు ఓణీల కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. మాజీ పీఏసీఎస్ పులఖండం రామకృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, రామకోటిరెడ్డి, ఎంపీటీసీ చిట్టియ్య, పులఖండం వెంకారెడ్డి, ముప్పవరపు శ్రీరాములు, తలకాయల కోటి, యశ్వంచ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని విచారణ వివరాలు, నీటి తీరువా వసూళ్లు, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నిర్వహిస్తున్న సమావేశానికి విధిగా హాజరుకావాలని సూచించారు.

అగ్రి యాప్‌లో నమోదు చేసుకోండి

బల్లికురవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలు పొందేందుకు రైతులు అగ్రి యాప్‌లో నమోదుతో 11 అంకెల యూనిక్ యాప్ పొందాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. మండలంలోని 20 రైతు సేవాకేంద్రాల్లో ఇప్పటికే సుమారు 8200 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని.. ఇంకా 2000 మంది నమోదు చేసుకోవాల్సి ఉందని తక్షణమే నమోదు చేసుకోవాలన్నారు. రైతు గుర్తింపు కార్డు లేకపోతే ప్రభుత్వ పథకాలతో పాటు పంట ఉత్పత్తులను అమ్ముకోలేనని విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందలేరని వివరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కారంచేడు కాలువ సెంటర్‌లో విజుబుల్ పోలీసింగ్‌లో ఎస్ఐ

కారంచేడు: ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వి. వెంకట్రావు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్లో విజుబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ద్విచక్రవాహనదారులు, ఆటో వాలాలకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల్లోపు బాలురుకు వాహనాలతో బైటకు వస్తే సహించేదిలేదన్నారు. చిన్నపిల్లలకు ద్విచక్రవాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాటలు, జూదాలు ఆడకూడదన్నారు. ఎక్కడైన పేకాటలు ఉంటే వెంటనే తనకు ఫోన్ ద్వార సమాచారం అందించాలన్నారు. ఏఎస్ఐ మధుబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

అద్దంకి: విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందిన సంఘటన మండలంలోని మణికేశ్వరం గ్రామంలో ఆదివారం జరిగింది. పసుపులేటి వెంకటేశ్వర్లుకు చెందిన గేదె పరిసరాల్లో పచ్చగడ్డి మేస్తూ ఉంది. అక్కడ ట్రాన్స్‌ఫార్ పక్కనున్న ఎర్త్ వైరుకు ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రసారం కావడంతో అక్కడే ఉన్న గేదె మృతిచెందినట్లు వెంకటేశ్వర్లు తెలిపాడు. మృతి చెందిన రూ.1లక్ష విలువ కలిగందని వాపోయాడు. గ్రామంలో విద్యుత్ పనులు జరుగుతున్నా.. పట్టించుకోకపోవడం వల్లే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు.



మృతిచెందిన గేదె

మల్లికార్జునా.. నీ చెంతకు చేరేదెలా?



రహదారి వసతి లేని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి



భక్తులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దారి

- ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు లేక భక్తుల అవస్థలు
- పండగల రోజుల్లో ఇబ్బందులు
- మట్టితోనే తాత్కాలికంగా దారి ఏర్పాటు చేసుకున్న వైనం
- పంచాయతీ, ఆర్‌అండ్ బీ అధికారులు స్పందించాలని వేడుకోలు

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలో భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లేందుకు రహదారి వసతి లేక భక్తులు అర్చకులు అవస్థలు పడుతున్నారు. 12 వశతాబ్దంలో కొణిదెనను చోళరాజులు పరిపాలించారు. అప్పట్లో కొణిదెన రెవెన్యూలో 101 శివలింగాలను ఏర్పాటు చేశారు. అందులోనివే బల్లికురవ, సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్‌కు పడమర భాగంలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న శివలింగం అని చరిత్రలు, పెద్దలు చెబుతున్నాయి. అయితే ఈ శివలింగం ఒరిగిపోయి ధూపదీపనైవేద్యాలకు సైతం నోచుకోవటంలేదు. దశాబ్దాల క్రితం నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన గోరంట్ల సుబ్బయ్య, సువర్చ దంపతులు ఒరిగిపోయిన శివలింగాన్ని పరిశీలించి అక్కడే గణనాథుడు, కుమార స్వామి అమ్మవారు, నందీశ్వరుడు విగ్రహాల ఏర్పాటుతో మండపం నిర్మించారు. ఆలయం వెలుపల నాగేంద్రస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. కార్తీకమాసం, మహాశివరాత్రి వేడుకలు, శివపార్వతుల కల్యాణం అన్నసంతర్పణతో పాటు, అర్చకులు ఇంకొల్లు సుధీర్‌శర్మ, మధుబాబుచే నిత్య ధూపదీప నైవేద్యాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. అయితే ఆలయానికి వెళ్ళేందుకు ఆర్‌ఆండ్‌బీ రోడ్డు నుంచి సుమారు 300 మీటర్లు రహదారి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఆలయ కమిటీ మల్లిఖార్జున స్వామి ఆలయానికి వెళ్లేందుకు దాతలను ఉదారంగా రహదారి కేటాయించాల్సిందిగా విన్నవిస్తున్నారు.

రహదారికి స్థలం కేటాయింపుతో సిమెంటు నిర్మాణం జరిగితే వర్షాకాలంలోనూ భక్తులు, అర్చకులు ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు తొలగుతాయి. ఇదిలా ఉండగా.. భక్తులు, ఆలయ కమిటీ వారు పండగ రోజుల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చెట్లను తొలగించి రైతులను అభ్యర్థించి తాత్కాలికంగా మట్టి దారిని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా ఆలయానికి వెళ్లేందుకు శాశ్వత రహదారి కేటయించాలని ఆలయ కమిటీని భక్తులు వేడుకుంటున్నారు.

చిట్టితల్లికి కష్టాలు

- మా పాపను బతికించండి
- మెదడుకు ఇన్‌ఫెక్షన్‌తో విజయవాడలో చికిత్స
- రూ.15 లక్షలవరకు ఖర్చు అవుతుందని చెప్పిన వైద్యులు
- ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వినతి



విజయవాడలో చికిత్సపొందుతున్న శ్రీవల్లి



బొంతా శ్రీవల్లి

బల్లికురవ: మెదడుకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో 15 రోజులుగా విజయవాడలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చావుబతుకులతో ఓ చిట్టితల్లి పోరాడుతోంది. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వి. కొప్పరపాడు ఎస్సీ కాలనికి చెందిన బొంతా ఏసుబాబు, దివ్య భారతి కూలీ పనులతో జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. వీరికి కుమార్తె శ్రీవల్లి తొమ్మిది సంవత్సరాలు స్థానిక పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. కుమారుడు స్టీఫెన్ 1వ తరగతి చదువుతున్నాడు. కూలీ పనులతో చిన్నారులను చదివిస్తున్న ఈ కుటుంబం పై విధికి కన్న పడింది. 15 రోజుల క్రితం శ్రీవల్లికి జ్వరం సోకటంతో స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం అదుపులోకి రాకపోవటంతో విజయవాడలోని రెయిన్‌బో వైద్యశాలకు చికిత్సకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు మెదడుకు ఇన్‌ఫెక్షన్ చేరిందని 15 రోజులపాటు వైద్యం చేయాలని రోజుకు లక్షవరకు ఖర్చు అవుతుందని ప్రకటించారని చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. పేదవారమైన తమను ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయాలని వేడుకున్న ఈ జబ్బు ఆరోగ్యశ్రీ పరిధిలోదని డబ్బు కడితేనే వైద్యం చేస్తామని వైద్యులు తేల్చి చెప్పినట్లు ఏసుబాబు దివ్యభారతి తెలిపారు. ఇప్పటికే అప్పోసోప్పో చేసి రూ. 4 లక్షల వరకు ఖర్చు పెట్టామని రెక్కాడితే కాని డొక్కాడని తమకు ఖరీదైన వైద్యం భారమైందని దయగల దాతలు చేయూతనిచ్చి తమ బిడ్డను బతికించాలని చిన్నారి తల్లి దండ్రులు అందరినీ ప్రార్థిస్తున్నారు.

ఘనంగా కార్యసిద్ధి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ



కార్యసిద్ధి హనుమాన్



కార్యసిద్ధి హనుమాన్ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పట్టణంలోని వైకుంఠపురం బాలసాయి నగర్‌లో నూతనంగా నిర్మించిన మందిరంలో ఆదివారం గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, జంట నాగ, ఓష్ట్రవాహన సహిత కార్యసిద్ధి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తయాహ్నిక దీక్షతో మూడు రోజులు పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది. కమిటీ సభ్యులు శనగవరపు సీతారామాంజనేయులు, శనగవరపు నాగమల్లేశ్వర శర్మ, కొణికి చంద్రశేఖర్, అద్దంకి శ్రీనివాస్, కల్లం అంజిరెడ్డి, వెల్లంచేటి సత్యనారాయణమూర్తి పర్యవేక్షించారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం పాల్గుణ మాసం రేవతి నక్షత్రం చవతి తిధి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అధునాతన వసతులతో సత్రం గదులు



మాట్లాడుతున్న శ్యామల చలమా రెడ్డి

అద్దంకి: సత్రంలో కళ్యాణాలు వివిధ కార్యక్రమాల నిర్వహించుకోవడం కోసం వచ్చే వారికి, సత్రం గదుల్లో అధునాతన (ఏసీ) వసతులు కల్పించడానికి తీర్మానించినట్లు శ్యామల చలమారెడ్డి అన్నారు. శింగరకొండలోని వేమారెడ్డి సేవాసమితి సత్రంలో ఆదివారం సత్ర కమిటీ సమావేశం న్నినిర్వహించారు. కార్యక్రమానికి శ్యామల చలమారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చలమారెడ్డి మాట్లాడుతూ రాబోయే శింగరకొంకడ తిరునాళ్లలో కులమత ప్రసక్తి లేకుండా అన్ని సామాజిక వర్గాల వారికి అన్నదానం చేయడానికి అంతా సహకరించాలని కోరారు. అదే విధంగా గత సంవత్సరం జమాఖర్చుల వివరాలను కమిటీ ముందు ఉంచారు. కళ్యాణమంటపాన్ని ఆధునీకీకరించాలని తీర్మానించారు.

సమావేశంలో బీవీ కృష్ణారెడ్డి కోట వెంకటేశ్వరరెడ్డి, ఇడమకటంటి మల్లిఖార్జునరెడ్డి, సందు నాగిరెడ్డి, మేడగం ప్రభాకర్‌రెడ్డి, పాకనాటి అంజిరెడ్డి, ఎనుముల శ్రీనివాసరెడ్డి, సోము పరమేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు, నెంబర్లు పాల్గొన్నారు.

మహిళలు అభ్యున్నతి చెందాలి



విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న పోలీస్ అధికారులు, వైద్యాధికారి అంజలి

ఇంకొల్లు(చినగంజాం): మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా సాధికారిక వారోత్సవాలను నిర్వహించారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు యోగా శిబిరం.. హెల్త్ క్యాంపు ఆదివారం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా బలవంతులు కావాలని సూచించారు. మహిళల కోసం పోలీస్ స్టేషన్‌లో మహిళా ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రత్యేకంగా ఉమెన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యోగా శిబిరంలో భాగంగా మహిళలకు యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి టి. అంజలిచే హెల్త్ క్యాంపును ఏర్పాటు చేసి ఇంకొల్లు పరిధిలోని పాఠశాలల విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. ఎస్ఐ జి. సురేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

బల్లికురవ: మండలంలోని కొణిదెన సచివాలయంలో ఆధార్‌నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కుసుమ కుమారి ఆదివారం తెలిపారు. ఇప్పటి వరకు కొమ్మినేని వారిపాలెం, ఉప్పుమాగులూరు, పాత మల్లాయపాలెం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తాజాగా కొణిదెన సచివాలయంలో కూడా ఏర్పాటు చేశామని ఆధార్‌లో సవరణలు, చిన్నారులకు కొత్త కార్డుల మంజూరుకు డిజిటల్ అసిస్టెంట్‌లను సంప్రదించి పొందవచ్చని వివరించారు.

గిట్టుబాటు ధర కోసం రైతుల ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లా రాజమోహన్

పర్చూరు(చినగంజాం): పొగాకు, మిర్చి, శనగలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. ఆదివారం చెరుకూరులో నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులు రూ. 40 వేలు కౌలు చెల్లించి సాగు కోసం అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకున్నారని వివరించారు. గతంలో పొగాకు ధర రూ. 15 నుంచి రూ. 18 వేల వరకు ఉందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు అడుగు పొగాకు ధర రూ. 4 వేలు కంటే లేదన్నారు. బీడీ, సిగరెట్ల ధరలు కూడా రోజురోజుకు పెరిగిపోతున్నా పొగాకు ధర మాత్రం పెరగటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ధరలతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

ఈ సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పర్చూరు వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, రైతులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన



మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ముస్లింలు

పర్చూరు(చినగంజాం): పర్చూరులో అతి పురాతనమైన అతహర్ మసీదు స్థానంలో నూతన మసీదు నిర్మాణానికి ఆదివారం కమిటీ సభ్యులు శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 1కోటితో కొత్త మసీదు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు మసీదు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ అహ్మద్ బాషా తెలిపారు. సుమారు 100 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన మసీదు గోడలు బలహీన పడి ప్రార్థనల సమయంలో భక్తులకు ఇబ్బంది కలుగుతుండటంతో దానిని తొలగించి దాని స్థానంలో నూతన మసీదును నిర్మించాలని, 8 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని అహ్మద్ బాషా తెలిపారు. నూతనంగా నిర్మించే మసీదులో ఒకే సారి 400 మంది ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా అన్ని హంగులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా త్వరగా పూర్తి కావాలని అందరూ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు ముతవల్లి షేక్ నబీషా, చీరాల మసీదు ముఫ్తి షేక్ హబీబుల్లా, నరసరావు పేట మౌలానా షాహిద్, గ్రామ పెద్దలు షేక్ షంషుద్దీన్, షేక్ ఖాజావలి, షేక్ మీరసా బాబు, షేక్ బుల్లా మేస్త్రీ, షేక్ కాలేష, షేక్ పోలీస్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం, ఆహార నియమాలతో ఆరోగ్యం

చీరాల అర్బన్: ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం, ఆహార సమయపాలన చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ గోరంట్ల సుబ్బారావు అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆరోగ్య సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యమే మహాభాగ్యం అని తెలుసుకోవాల్నారు. ప్రతి రోజూ ఉదయం వ్యాయామం చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని సమయపాలనతో తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గాదె హరిహర రావు, ప్రధాన కార్యదర్శి అత్తులూరి రామారావు, సలహాదారు శర్మ, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహానికి సొబగులు



భూమి పూజ నిర్వహించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చీరాల అర్బన్: పట్టణంలోని ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలోని శ్రీ సరస్వతిదేవి అమ్మవారి విగ్రహానికి ఎండ తగలకుండా ఉండేందుకు శ్లాబు ఏర్పాటు పనులు ఆదివారం నిర్వహించారు. ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నీడ కల్పించేందుకు పిరమిడ్ పద్ధతిలో సుమారు రూ.80వేలతో నిర్మించనున్నారు. భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ళ గురుప్రసాద్, జి.నారాయణరెడ్డి, డీవీ సురేష్, తులాబందు వెంకట సురేష్, సుబ్బరామయ్య, వీరాంజనేయులు, తిరుపతిరావు, మధుసూదనరావు, సుధాకరరావు పాల్గొన్నారు.

'అ'పూర్వ' సమ్మేళనం

పొన్నలూరు: మండలంలోని చెరువుకొమ్ముపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మళ్లీ అదే పాఠశాల్లో కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు అప్పటి విద్యార్థుల్లోని కనపర్తి మోహన్, ఉప్పటూరి మల్లీశ్వరి, మడతల పుష్ప చొరవ తీసుకొని ముందుకు వచ్చి తమతో చదువుకున్న విద్యార్థులతో సంప్రదింపులు చేసి ఒకచోటకు తీసుకొచ్చారు. ఈ ఆత్మీయ కలయిక ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. 2014–15 పదవ తరగతి చదివిన వీరంతా పాఠశాల్లో కలుసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు విచ్చేసి తమకు విద్యాబోధన చేసిన గురువులకు ఘనంగా స్వాగతం పలికారు. పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకొని అప్పటి హెచ్ఎం డీఎస్‌కేవీ ప్రసాదరావుతో పాటు ఉపాధ్యాయులకు పాదాభివందన చేసి ఘనంగా సన్మానించి జ్ఞాపకలను అందజేశారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

బోర్డు ఉంది.. అధికారుల పేర్లేవీ!



అధికారుల పేర్లు లేకుండా ఖాళీగా ఉన్న బోర్డు

చీరాల: సామాన్య ప్రజలు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా పనిచేయించుకోవడానికి, తనకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 2005లో సమాచార హక్కు చట్టాన్ని దేశమంతటా అమల్లోకి తెచ్చింది. ఏ ప్రభుత్వ కార్యాలయం అయినా అందులో కావాల్సిన సమాచారం తెలుసుకోవడానికి పౌరసమాచార అధికారి, సహాయ పౌరసమాచార అధికారి, అప్పిలేట్ అథారిటీ అని ముగ్గురు అధికారుల పేర్లు, హోదా, సెల్ నంబర్లు ఏర్పాటు చేస్తారు. అయితే చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో మాత్రం అందుకు భిన్నంగా అధికారుల పేర్లు బోర్డులో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. చీరాల రెవెన్యూ డివిజన్ ఏర్పడిన తర్వాత మొదటిగా వచ్చిన అధికారి పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు.

ఇప్పటి వరకు ఇద్దరు అధికారులు మారినా ప్రస్తుత అధికారి పేరు మాత్రం అందులో కనిపించకపోవడం విశేషం.